# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**జూలై 2, 2011**

## ఆదివాసీ, దళిత సాంస్కృతిక కార్యకర్తలూ, నాయకులూ కామ్రేడ్స్ జీతన్ మరాండీ, అనిల్ రామ్, మనోజ్ రాజ్‌వర్, ఛత్రపతి మండల్‌లకు విధించిన మరణదండనలను తక్షణం రద్దు చేయాలి!

జూన్ 23న ఝార్ఖండ్‌లోని గిరిడీ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఇంద్రదేవ్ మిశ్రా జీతన్ మరాండీ, అనిల్ రామ్, మనోజ్ రాజ్‌వర్, ఛత్రపతి మండల్‌లకు 2007లో 19మంది హత్య జరిగిన ఛిల్కారీ కేసులో మరణదండనను విధించాడు. తద్వారా రాజ్యం మరోసారి తన ఫాసిస్టు నైజాన్ని బయటపెట్టుకుంది. జీతన్ మరాండీ, ఇతరులూ ఎల్లప్పుడూ బహిరంగంగానే పని చేస్తూ వచ్చారు, వారు పని చేస్తున్న సంస్థలు కూడా నిషేధిత సంస్థలు ఏమీ కావు. వారికి ఎటువంటి సంబంధమూ లేని ఒక కేసులో వారికి మరణ దండన విధించడం అంటే తమ ఆట, పాటల ద్వారా సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, ప్రత్యేకించి విస్థాపన వ్యతిరేక ప్రజాపోరాటాలకు వారు దృఢమైన అండగా నిలుస్తున్నందుకు చేపట్టిన కక్షసాధింపు చర్యే ఇది అనేది స్పష్టమౌతోంది.. దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని, ముఖ్యంగా మధ్య, తూర్పు భారతాల్లో, అణచివేయడానికి చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల్లోకెల్లా పేదలైన ఆదివాసులపై అత్యంత హీనమైన, పాశవికమైన అత్యాచారాలకు పాల్పడుతున్నాయి, ఈ మరణదండనలు ఇందుకు మరో సాక్ష్యం. ఆపరేషన్ గ్రీన్‌హంట్ అత్యంత పాశవికమైన రూపాలు ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిషాల్లో, అందులోనూ మావోయిస్టు ఉద్యమం ఆ రాష్ట్రాల్లో బలంగా ఉన్న ఆదివాసీ ప్రాంతాల్లో  అమలవుతున్నాయి.

జీతన్ మరాండీ ప్రముఖ ఆదివాసీ సాంస్కృతిక కళాకారుడు, ఝార్ఖండ్ అభేన్ అనే సాంస్కృతిక సంస్థ నాయకుడు, అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమాఖ్య నాయకుడు. విప్లవ గానాల్నీ, సంస్కృతినీ ప్రచారం చేస్తూ ఆయన దేశవ్యాప్తంగా పర్యటించారు. అనిల్ రామ్, మనోజ్ రాజ్‌వర్, ఛత్రపతి మండల్‌లు కూడా ఆదివాసీ, దళిత సాంస్కృతిక కళాకారులు. జీతన్ చిన్నతనం నుండే సాంస్కృతిక ప్రతిభను కనబరిచాడు. క్రమంగా ఆయన మన దేశంలోనే అత్యుత్తమ కళాకారుల్లో ఒకరిగా ఎదిగారు. చైతన్యవంతమైన పిల్లవాడిగా ఆయన తాను భాగమైన ఆదివాసీ సమాజ స్థితిగతులను పట్టించుకోకుండా వుండలేకపోయాడు. ఆదివాసుల దారిద్ర్యానికీ, దోపిడీకీ, అణచివేతకూ మూలకారణాలను తెలుసుకోవడానికి ఆయన చేసిన సామాజిక పరిశోధన సహజంగానే ఆయనను విప్లవ రాజకీయాలకేసి తీసుకుని పోయింది. ఆయనా, ఆయన సాంస్కృతిక సంస్థా ప్రజల చైతన్యాన్ని పెంపొందించడానికి విప్లవ  రాజకీయాలను ప్రచారం చేస్తాయి.

తమ భావాలను బహిరంగంగా ప్రచారం చేయడం నేరం కాదు, అందుకు ఎవరూ శిక్షార్హులు కారు. భారతదేశ పాలకవర్గాలు ఎటువంటి నిరసననూ సహించడానికి సిద్ధంగా లేక ప్రజల సహజ వనరులనూ, అపారమైన ఖనిజ సంపదనూ లూటీ చేయడానికి ఉద్దేశించిన సామ్రాజ్యవాద అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించే గళాలన్నిటినీ నొక్కేయడానికి అన్ని రకాల కుయుక్తులకూ పాల్పడుతున్నాయి. నిజమైన ప్రజా కళాకారులుగా వారు దేశ పాలకవర్గాల విస్థాపన విధానాలకు అత్యంత దృఢమైన ప్రతిఘటనల్లో ఒకటిగా నిలుస్తున్న ఝార్ఖండ్‌లోని విస్థాపన వ్యతిరేక ఉద్యమానికి ముందుపీటీన నిలిచారు. రాజ్యం వారిని ఈ రాజకీయ కార్యకలాపాల కోసమే శిక్షిస్తోంది తప్ప ఏదో ఛిల్కారీ కేసు కోసం కాదనేది తేటతెల్లమే. ఎందుకంటే ఛిల్కారీ సహా వారి మీద పెట్టిన డజన్లకొద్దీ కేసులన్నీ తప్పుడువే అనేది అందరికీ తెలిసినదే. బీహార్, ఝార్ఖండ్‌లలో జరిగిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో భూస్వాములు తమ ప్రైవేటు సైన్యాల ద్వారా రైతాంగంపై, ప్రత్యేకించి దళితులపై ఊచకోతలు సాగించారు. రైతాంగం ఆత్మరక్షణలో భాగంగా ప్రతిహింసను చేపట్టక తప్పలేదు. ఛిల్కారీ వంటి ఘటనలు అందులో భాగమే. ఇటువంటి సంఘటనలకు గల మూలకారణాలను వెతకకుండా రాజ్యం వీటిని ఉపయోగించుకుని ప్రజాసంఘాలపై తప్పుడు కేసులను బనాయించి, వారి గొంతు నులమడానికి ప్రయత్నిస్తోంది. మొదటగా వారు రాంచీలోని రాజ్‌భవన్ ముందు రాజకీయ ఖైదీల సమస్యపై రెచ్చగొట్టే ప్రసంగాలు చేశాడనే సాకుతో జీతన్ మరాండీపై 2007లో ఒక

రాజద్రోహ కేసును పెట్టారు. అప్పటినుంచీ ఆయనను జైల్లో పడేసి తప్పుడు కేసులతో వేధిస్తున్నారు. అంతకు ముందు కూడా ఆయనను చాలాసార్లు అరెస్టు చేసి కొన్నిసార్లు దారుణంగా కొట్టారు కూడా. చివరిగా ఆప్పుడీ కుట్రలన్నిటికీ పరాకాష్టగా మరణదండన విధించి ఆయన గొంతును శాశ్వతంగా  నొక్కేయాలని చూస్తున్నారు. రాజ్యం ఎంత సిగ్గుమాలినతనంగా వుందంటే ఆయనను తానే స్వయంగా జైల్లో బంధించి ఉన్నప్పుడు జరిగిన పీర్టాండ్, తీస్రీ పోలీస్ స్టేషన్‌ల కేసులను కూడా ఆయనపై బనాయించింది !

మన దేశం 200 ఏండ్ల సుదీర్ఘకాలం బ్రిటిష్‌వారి వలసపాలనలో మగ్గిపోయింది. ఫలితంగా ఎన్నో ఆదివాసీ తిరుగుబాట్లకు సాక్ష్యంగా నిలిచింది. బ్రిటన్ సామ్రాజ్యవాదం ఆధునిక ఆయుధాల దన్నుతో పాశవిక బలాన్ని ప్రయోగించి ఈ తిరుగుబాట్లను అణచివేయ బూనుకున్నది. తిరుగుబాట్ల నాయకులను ఉరితీయడం అనేది అది అత్యధికంగా వుపయోగించిన అణచివేత ఎత్తుగడల్లో ఒకటి. వలస పాలకుల అణచివేత యంత్రాంగానికి వారసులైన దళారీ భారత పాలకవర్గాలు వారి అడుగజాడల్లోనే నడుస్తున్నారు. కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌లు 'స్వతంత్ర' భారతావనిలో ఉరితీయబడిన మొదటి విప్లవ రైతాంగ కార్యకర్తలు. ఆ తర్వాత అనేకమంది విప్లవ కార్యకర్తలను, ప్రత్యేకించి (ఇప్పటి ఝార్ఖండ్‌ను కూడా కలిపి ఉన్న) బీహార్ విప్లవ రైతాంగ కార్యకర్తలను తప్పుడు కేసుల్లో ఇరికించి మరణదండన విధించిన ఘటనలు అనేకం జరిగాయి. ప్రజాలాయర్లు, పౌరహక్కుల నాయకులూ అయిన కెజి కన్నాబిరాన్, పత్తిపాటి వంటివారు తమ పౌరహక్కుల సంఘాల్లో భాగంగా కోర్టుల్లోనూ, బయటా కూడా ప్రత్యేకమైన మరణదండనల్ని రద్దు చేయాలని పోరాడ్డమే కాక, మొత్తంగానే మరణదండనలను రద్దు చేయాలని విశాల ఉద్యమాల్ని నిర్మించారు. రాజ్యం ఆదివాసీ గూడేల్లో రోజువారీగా ఊచకోతలనూ, బూటకపు ఎన్‌కౌంటర్లనూ, అత్యాచారాలనూ కొనసాగిస్తూనే మరింతగా ఉరిశిక్షల వంటి ఫాసిస్టు చర్యలకు కూడా పాల్పడుతుందనేది తేటతెల్లమౌతున్న ఈ తరుణంలో ఈ పోరాటాన్ని మరింత విశాల ప్రాతిపదికన చేపట్టాల్సిన అవసరం వుంది. నారాయణపట్నాకు చెందిన సింగన్నను పోలీసులు సూటిగా గురిచూసి కాల్చి చంపారు. లాల్‌గఢ్‌కు చెందిన లాల్‌మోహన్ టుడును బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చి చంపారు. ఇప్పుడు ఝార్ఖండ్‌కు చెందిన జీతన్ మరాండీకి ఉరిశిక్ష వేశారు. భూస్వామ్యానికీ, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికీ, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాఉద్యమాల నుండి నాయకులుగా ఎదిగి ముందుకొస్తున్న వారిని హతమార్చాలనే కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతోంది. ప్రజాపోరాటాలకు నాయకత్వాన్ని లేకుండా చేయడం ద్వారా ఆదివాసీ ప్రాంతాలలోని సహజసంపదల్ని అడ్డూ ఆపూ లేకుండా దోచుకోవడానికి గల అడ్డంకుల్ని తొలగించుకోవాలని వారి ప్రయత్నం.

తమకు మరణదండన విధించగానే జీతన్, కోర్టులో గల మరికొందరు ప్రజలూ పాడినట్టుగా – రాజ్యం అమలు చేస్తున్న ఈ ఫాసిస్టు చర్యలన్నీ ప్రజాప్రభంజనాల ద్వారా 'అంతమయ్యే రోజు తప్పక వస్తుంది'. చెరసాలలు, ఉరికొయ్యలు ప్రజల నిజమైన నాయకుల విప్లవచేవను గొంతు నులమలేవు, వారు చివరకంటా పోరాడుతారు.

జీతన్ మరాండీ, అనిల్ రామ్, మనోజ్ రాజ్‌వర్, ఛత్రపతి మండల్‌లకు విధించిన మరణ దండనలను తక్షణం రద్దు చేయాలని సిపిఐ (మావోయిస్టు) డిమాండ్ చేస్తోంది. అన్ని ప్రజాస్వామిక, పౌరహక్కుల సంఘాలకూ, రాజకీయ ఖైదీల విడుదలకై పోరాడే సంఘాలకూ, ప్రత్యేకించి కళా, సాహిత్య సంఘాలకూ, ఆదివాసీ సాంస్కృతిక సంస్థలకూ మరణదండనల రద్దుకై, ఈ ప్రజా కళాకారుల విడుదలకై విశాల ఉద్యమాలను నిర్మించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. మొత్తంగా మరణదండనల రద్దు కోసం జరిగే ఉద్యమంగా దీన్ని విశాల ప్రాతిపదికన కొనసాగిద్దాం.



**(అభయ్)**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**